సాక్షి చిత్తూరు

శనివారం । 20 । ఏప్రిల్ । 2024



రెండు గంటలొస్తే ఐదొందలు..
చంద్రబాబు నామినేషన్ సందర్భంగా ర్యాలీకి జన సమీకరణ కోసం టీడీపీ నేతలు నానా అవస్థలు పడ్డారు. - 8లో



వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం
తిరుపతిలోని శ్రీ కోందండరామస్వామి ఆలయంలో శుక్రవారం వైభవంగా రామ పట్టాభిషేకం నిర్వహించారు. - 8లో



నాటి ధీమా ఎక్కడ..?
కుప్పంలో విజయావకాశాలపై చంద్రబాబులో నమ్మకం సడలుతోంది. స్థానిక నేతలపై విశ్వాసం కొరవడుతోంది. - 8లో

న్యూస్‌రీల్

మందుల గోల్‌మాల్‌పై విచారణ



మాట్లాడుతున్న రత్నకుమారి

చిత్తూరు రూరల్: సుమారు రూ.70లక్షల విలువైన మందుల విషయంలో 2012లో జరిగిన గోల్‌మాల్‌పై వచ్చిన ఫిర్యాదుల మేరకు కడప రీనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ సర్వీసెస్ రత్నకుమారి విచారణ చేపట్టారు. శుక్రవారం నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అధికారుల సమక్షంలో వివరాలు సేకరించారు. ఈ మేరకు నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపనున్నట్లు వెల్లడించారు.

కాణిపాకం ఆలయ హుండీ లెక్కింపు

చిత్తూరు రూరల్: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శుక్రవారం హుండీ లెక్కింపు చేపట్టారు. 23 రోజులకు గాను స్వామివారి హుండీ ద్వారా రూ.1,35,78,724 , గో సంరక్షణ హుండీలో రూ.7,735, నిత్య అన్నదాన హుండీలో రూ.28,555 , డీడీ ద్వారా రూ.2,94,701లు వచ్చాయి. విదేశీ కరెన్సీతోపాటు 32 గ్రాముల బంగారం, 970 గ్రాముల వెండి వచ్చినట్లు ఈఓ వెంకటేశులు తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ వాణి, ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, హరి మాధవరెడ్డి, ధనంజయ్య పాల్గొన్నారు.

ఐదేళ్లుగా ప్రజాసేవలోనే..!

చిత్తూరు కలెక్టరేట్ : గత ఐదేళ్లుగా ప్రజాసేవలో ఉంటున్న గొప్ప నాయకుడు ఎంపీ రెడ్డెప్ప అని వైఎస్సార్‌సీపీ కుప్పం ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రెడ్డెప్ప నామినేషన్ దాఖలుకు విచ్చేసిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. చిత్తూరు ఎంపీ స్థానాన్ని తాము తప్ప ఎవ్వరూ గెలవలేరనే టీడీపీ నేతల అహంకారాన్ని రెడ్డెప్ప జయించారని వెల్లడించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లో తీసుకెళ్లి అందరి మన్ననలు పొందారని వివరించారు. క్షేత్రస్థాయిలో పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారన్నారు. మరోసారి చిత్తూరు ఎంపీగా నామినేషన్ దాఖలు చేసిన ఆయన గతం కంటే ఎక్కువ మెజారిటీ తో గెలుస్తారని తెలిపారు.

పెద్దిరెడ్డిని విమర్శిస్తే సహించం



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప

చిత్తూరు కలెక్టరేట్ : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శిస్తే సహించే ప్రసక్తే లేదని చిత్తూరు ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు స్పష్టం చేశారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడారు. అన్నమయ్య జిల్లా పీలేరులో ఈ నెల 18వ తేదీన కిరణ్‌కుమార్‌రెడ్డి నోటికి వచ్చినట్టు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై ఆరోపణలు చేశారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో పదవి కోసం వచ్చిన ఆయనను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. కిరణ్‌కు ప్రజలతో ఎలాంటి సంబంధాలు లేవని, హైదరాబాద్‌లో పుట్టి పెరిగారని విమర్శించారు. వాయల్పాడులో ఎప్పుడూ ఉన్న దాఖలాలు లేవని వెల్లడించారు. గత ఎన్నికల్లో తమ్ముడినే గెలిపించుకోలేని అసమర్థుడని తెలిపారు. బీజేపీలో గవర్నర్ పదవి ఆఫర్ ఇస్తే వారితో కలిసి పోయారని ఎద్దేవా చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నిరంతరం పేద ప్రజల కోసం పనిచేస్తున్నారని తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. శుక్రవారం జిల్లాకు విచ్చేసిన అబ్జర్వర్లు కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1,771 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. 1,266 పోలింగ్ లోకేషన్లు ఉన్నాయన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌క్యాస్టింగ్, వీడియో కవరేజ్, మైక్రో అబ్జర్వర్లను నియమించామని వివరించారు. 425 సమస్య, అత్యంత సమస్యాత్మక కేంద్రాలలో వీడియో కవరేజ్, వెబ్‌క్యాస్టింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. 24 గంటల పాటు వివిధ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో వ్యయ అబ్జర్వర్లు శంకర్‌ప్రసాద్‌శర్మ, శ్రీనివాస్ ఐన్నా, రోహన్ ఠాఖూర్, ఎస్పీ మణికంఠ, జేసీ శ్రీనివాసులు పాల్గొన్నారు.



పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి నామినేషన్ సందర్భంగా భారీ ర్యాలీ



నగరిలో మంత్రి రోజా నామినేషన్ సందర్భంగా వైఎస్సార్‌సీపీ శ్రేణుల ర్యాలీ

నామినేషన్ల జోరు



నామినేషన్ వేస్తున్న చిత్తూరు ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప



నామినేషన్ వేస్తున్న నగరి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌కే రోజా

గుండెల నిండా అభిమానం.. వీధులన్నీ జనసంద్రం.. ప్రతి హృదయంలో జగన్నినాదం.. వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో సమరోత్సాహం.. అందరి మదిలో గెలుపే లక్ష్యం.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. శుక్రవారం ఈ మేరకు ఆయా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజా, ఎంపీ రెడ్డెప్ప, సునీల్‌కుమార్, కృపాలక్ష్మి నామినేషన్లు దాఖలు చేశారు. తమను అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే వివిధ పార్టీలకు చెందిన పలువురు అభ్యర్థులు సైతం తమ నామినేషన్లను సమర్పించారు.



మంత్రి పెద్దిరెడ్డి సతీమణి స్వర్ణమ్మ..



పలమనేరు ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ..

- రెండో రోజు 16 మంది నామినేషన్లు
- అట్టహాసంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ర్యాలీలు
- స్వచ్ఛందంగా తరలివచ్చిన వేలాదిమంది ప్రజలు

సాక్షి, చిత్తూరు: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. అందులో భాగంగా రెండోరోజు జిల్లావ్యాప్తంగా ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ స్థానాలకు మొత్తం 16 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఈ క్రమంలో చిత్తూరు ఎంపీ (ఎస్సీ) స్థానానికి ఎన్.రెడ్డెప్ప (వైఎస్సార్‌సీపీ-2సెట్లు), ఎన్.రెడ్డెమ్మ (రెడ్డెప్ప సతీమణి, వైఎస్సార్‌సీపీ- 2సెట్లు), దుగ్గిరాల నాగేశ్వరరావు (జాతీయ జనసేన) కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఇక పుంగనూరు నియోజవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి (వైఎస్సార్‌సీపీ - 2 సెట్లు) , పి.స్వర్ణలత (పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సతీమణి, వైఎస్సార్‌సీపీ-2సెట్లు), నగరి నియోజవర్గంలో ఆర్‌కే రోజా (వైఎస్సార్‌సీపీ-2 సెట్లు), ధనశేఖర్‌శెట్టి (ఇండిపెండెంట్), గంగాధర నెల్లూరు నియోజకవర్గం (ఎస్సీ)లో కళత్తూరు కృపాలక్ష్మి (వైఎస్సార్‌సీపీ-2సెట్లు), పళ్లిపట్టు గుణశేఖర్ (సమాజ్‌వాదీ పార్టీ) నామినేషన్ వేశారు. ఇక పూతలపట్టు నియోజవర్గం (ఎస్సీ) డాక్టర్ ఎం.సునీల్‌కుమార్ (వైఎస్సార్‌సీపీ-2సెట్లు), కె.మురళీమోహన్ (టీడీపీ), పలమనేరు నియోజకవర్గం ఎన్.వెంకటేగౌడ (వైఎస్సార్‌సీపీ), ఎన్.పావని (వెంకటేగౌడ సతీమణి), ఎన్.అమర్‌నాథరెడ్డి (టీడీపీ), రేణుకారెడ్డి (అమర్‌నాథరెడ్డి సతీమణి) నామినేషన్ దాఖలు చేశారు. కుప్పం నియోజకవర్గంలో నారా చంద్రబాబు నాయుడు తరఫున ఆయన సతీమణి నారా భువనేశ్వరి (టీడీపీ) నామినేషన్ సమర్పించారు. శుక్రవారం మొత్తం ఎంపీ స్థానం కోసం ముగ్గురు అభ్యర్థులు ఐదు సెట్లు, ఎమ్మెల్యే స్థానాల కోసం మొత్తం 13 మంది అభ్యర్థులు 18 సెట్ల నామినేషన్ పత్రాలను ఆయా రిటర్నింగ్ అధికారులకు అందజేశారు.



పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్..



వెంకటేగౌడ సతీమణి పావని..

పార్టీలకు అతీతంగా ఆకలి తీర్చిన 'రాజన్న'

కుప్పంరూరల్ : చంద్రబాబు తర పున నామినేషన్ వేసేందుకు ఆయన సతీమణి భువనేశ్వరి శుక్రవారం కుప్పం వచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు భారీగా జన సమీకరణకు విఫల యత్నం చేశారు. చివరకు వచ్చిన వారికి సైతం భోజనం పంపిణీ చేయలేకపోయారు. ఈ క్రమంలో కుప్పంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిర్వహిస్తున్న రాజన్న క్యాంటిన్ వారికి ఆకలి తీర్చింది. టీడీపీ కార్యక్రమానికి వచ్చిన మహిళలు, వృద్ధులకు ఆహారం అందించింది. ఉచితంగా తమ కడుపు నింపిన భరత్ చల్లగా ఉండాలని ఓ వృద్ధురాలు మనసారా ఆశీర్వదిస్తూ వెళ్లడం విశేషం.



రాజన్న క్యాంటిన్‌లో భోజనం తీసుకుంటున్న టీడీపీ కార్యకర్తలు, మహిళలు



జీడీ నెల్లూరులో నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కళత్తూరు కృపాలక్ష్మి



నామినేషన్ వేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి

చంద్రబాబు అండతోనే 'చల్లా' రౌడీయిజం

- పోలీసులపై దాడులు చేసిన వ్యక్తికి ఎమ్మెల్యే టికెట్టా..?
- వెన్నుపోట్లు.. మోసాలకు కేరాఫ్ బాబు
- సీమాంధ్ర ద్రోహి నల్లారి కిరణ్
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పుంగనూరులో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పక్కన ద్వారకనాథరెడ్డి

పుంగనూరు : చంద్రబాబు అండతోనే చల్లా రామచంద్రారెడ్డి రౌడీయిజం చెలాయిస్తున్నారని, ప్రశాంతతకు మారుపేరైన పుంగనూరులో రక్తపాతం సృష్టించారని మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండిపడ్డారు. శుక్రవారం వేలాదిమంది అభిమానులు, నేతలు, కార్యకర్తలు ర్యాలీగా వెంటరాగా ఆయన ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం గోకుల్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. గత ఏడాది ఆగస్టు 4వ తేదీన చంద్రబాబు పర్యటన సందర్భంగా దుర్బుద్ధేశంతో అల్లర్లు సృష్టించి పోలీసులపై చల్లా రామచంద్రారెడ్డి దాడులకు పాల్పడ్డారని తెలిపారు. కర్రలు, రాళ్లు, ఇనుప రాడ్లు, బాటిళ్లతో దాడులు చేయించి 50 మంది పోలీసులను గాయపరిచారన్నారు. చల్లా రక్తదాహానికి చాలా మంది పోలీసులకు కళ్లు పోయాయని, కాళ్లు తెగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీహార్ తరహాలో పోలీసులపైనే దాడులు చేయించిన ఘనమైన చరిత్ర టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డిదే అని విమర్శించారు. అలాంటి సంఘ విద్రోహికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిన చంద్రబాబు ఎలాంటి వారో అర్థం చేసుకోవాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే పోలీసులు కేసులు పెట్టకుండా ఉంటారా.. జైలుకు పంపకుండా ఉంటారా అని ప్రశ్నించారు. దీనికి కూడా మంత్రి పెద్దిరెడ్డి కారణమని దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి నేర మనస్తత్వం ఉన్నవారికి అధికారం అప్పగిస్తే ప్రజలకు రక్షణ ఉండదని తెలిపారు. పుంగనూరులో హిందూ ముస్లింలు సోదరభావంతో మెలుగుతుంటారని, వారి మధ్య కూడా చిచ్చు పెట్టేందుకు సైతం ఇలాంటి వారు వెనుదీయరని హెచ్చరించారు. విపరీత స్వభావంతో విర్రవీగే చలా రామచంద్రారెడ్డి లాంటి వారికి ప్రజలు ఓటు బుద్ధి చెప్పాలని సూచించారు.

సోనియాకే తలొంచలేదు..

కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు సైతం సోనియా గాంధీకే తల వంచలేదని, అలాంటిది సీమాంధ్ర ద్రోహి కిరణ్‌కుమార్‌రెడ్డితో సన్నిహితంగా ఉండేందుకయత్నిస్తానా అని ప్రశ్నించారు. కిరణ్‌కుమార్‌రెడ్డి తనకు ఎప్పుడూ శత్రువే అని, జగన్‌ను జైలుకు పంపిన వ్యక్తిని క్షమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పుట్టపర్తి సాయిబాబా పరమపదిస్తే పదిరోజుల పాటు భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించకుండా, ఆయన సంపదను కిరణ్ దోచుకున్నారని ఆరోపించారు. ఏపీ ప్రజలను మోసం చేసి రాష్ట్ర విభజనకు కారణమైన ద్రోహి కిరణ్ అని మండిపడ్డారు. ఇప్పుడు బీజేపీ ముసుగులో ఎంపీ టికెట్ తెచ్చుకునేందుకు కిరణ్ సిగ్గుపడాలని విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట ఎంపీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో దిగిన పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలించాలని పిలుపునిచ్చారు. స్వార్థ రాజకీయాలకు కేరాఫ్‌గా నిలిచిన నల్లారి కిరణ్‌ను చిత్తు చిత్తుగా ఓడించాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ అమ్ము, ఆర్యవైశ్య సంఘ నాయకులు బాలసుబ్రమణ్యం , ముల్లంగి విజయ కుమార్, పీఎల్ ప్రసాద్, నాగరాజా, పీఎల్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బాబువన్నీ మోసాలే!

2014 ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు 600 హామీలు ఇచ్చి ఒక్కటి కూడా నేరవేర్చలేదని మంత్రి పెద్దిరెడ్డి విమర్శించారు. పుంగనూరు నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకుంది చంద్రబాబు, కిరణ్‌కుమార్‌రెడ్డే అని మండిపడ్డారు. దేనన్నారు. 30 ఏళ్లలో జరగని అభివృద్ధిని 5 ఏళ్లలో చేసి చూపించామని స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

ప్రాణం ఉన్నంత వరకు ప్రజాసేవే..!



ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి, వైఎస్సార్‌సీపీ నగరి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌కే రోజా, పక్కన సిద్ధార్థరెడ్డి

- నగరి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం : మంత్రి రోజా
- రోజమ్మ హ్యాట్రిక్ గెలుపు తథ్యం : బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నగరి : ప్రాణం ఉన్నంత వరకు ప్రజాసేవలోనే ఉంటానని, నగరి నియోజకవర్గ ప్రజలకు అండగా నిలుస్తాని మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌కే రోజా స్పష్టం చేశారు. శుక్రవారం వేలాదిమంది కార్యకర్తలు, నేతలు ర్యాలీగా వెంటరాగా ఆమె ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద ప్రజలనుద్దేశించి మాట్లాడారు. జగనన్న పిలుపు మేరకు ప్రజలు తనను రెండు పర్యాయాలు గెలిపించారన్నారు. దేవుని ఆశీస్సులతో జగనన్న ముఖ్యమంత్రి అయ్యారని, జగనన్న అండతో తనకు మంత్రిగా ప్రజలు సేవ చేసే భాగ్యం లభించిందని వెల్లడించారు. పేదల ప్రతినిధి జగనన్న సహకారంతోనే గత ఐదేళ్లలో రూ.2,012 కోట్ల మేర అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించగలిగానని వివరించారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానన్నారు. ప్రజల ఆశీర్వదిస్తే మరింతగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ధైర్యంగా చెబుతున్నామని.. ఎల్లప్పుడూ మీతోనే ఉంటామని.. అందుబాటులో ఉంటాని.. ఫ్యాను గుర్తుకే ఓటేయాలని పిలుపునిచ్చారు. ఈరోజు కొంతమంది తనను ఓడిస్తామంటున్నారని, మీరు ఓడిస్తా అంటే చూస్తూ ఉండేందుకు తాను లోకేష్ కాదని, పవన్‌కల్యాణ్‌ను అంతకంటే కాదని స్పష్టం చేశారు. బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ నగరి ఎమ్మెల్యే మంత్రి రోజమ్మ హ్యాట్రిక్ విజయం సాధించడం తథ్యమని తెలిపారు. నిస్వార్థంగా సేవలందించే రోజమ్మలాంటి నేతలకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

ఆటోను ఢీకొన్న కారు

- 10 మందికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి

పుంగనూరు : మండలంలోని పత్తెమ్మగారిపల్లె వద్ద శుక్రవారం రాత్రి ఓ ఆటోను కారు ఢీకొనడంతో 10 మంది గాయపడ్డారు. వివరాలు.. సింగిరిగుంట గ్రామానికి చెందిన కూలీలు గాయిత్రి(32), పుట్టమ్మ(45) , జ్యోతి(35), పెద్దరెడ్డెమ్మ(45), పద్మావతి(45), పార్వతమ్మ(60), వైశాలి(18), నాగవేణి(22), మునెమ్మ(65), సుజాత(45) కూలీ పనులకు వెళ్లి జీవనం సాగిస్తుంటారు. ఈ క్రమంలో ఉదయం ఆటోలో కూలీ పనులకు రామసముద్రం మండలం వనగానిపల్లెకు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గ మధ్యంలో వెనుకవైపు నుంచి కారు ఢీకొని వెళ్లిపోయింది. క్షతగాత్రులను 108 లో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో మునెమ్మ, సుజాత పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి ఆస్పత్రికి చేరుకుని , గాయపడిన వారిని పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలందించాలని డాక్టర్లకు సూచించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలోకి పలువురు నేతలు

పుత్తూరు: కుల, మత, పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి ఆర్కే రోజా అందిస్తున్న సేవ, సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులకు ఆకర్షితులై తాము వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు జనసేన నాయకులు వెల్లడించారు. శుక్రవారం రాష్ట్ర కాపు సంక్షేమ సేన ప్రధాన కార్యదర్శి గోపిరాయల్, జనసేన నాయకులు కె.ఆనంద్‌బాబు, టి.వెంకటేశులు, శశికుమార్, ఎండీ మునస్వామి, సారథి తమ అనుచరులతో కలిసి మంత్రి రోజా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గోపీరాయల్ మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన పార్టీలు కాపులను ఎన్నికల సమయంలో వాడుకుని, తర్వాత కరివేపాకులా తీసి పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాపులకు న్యాయం జరగకపోయినా పవన్‌కల్యాణ్ నోరుమెదపక పోవడం బాధాకరమన్నారు. ఓ పార్టీలో ఉంటూ మరోపార్టీ జెండా మోయడానికి మనసు అంగీకరించలేదని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అందరూ బాగుండాలన్న లక్ష్యంతో పనిచేస్తోందని, జగనన్న సైనికురాలిగా పనిచేస్తున్న మంత్రి రోజమ్మ గెలుపునకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, నాయకులు రవీంద్ర, ప్రసాద్, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో మంత్రి రోజా (ఇన్‌సెట్)



గుడుపల్లె : వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలు

టీడీపీ నుంచి..

గుడుపల్లె : మండలంలోని చీకటిపల్లె గ్రామంలోని 25 కుటుంబాలవారు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. జెడ్పీ మాజీ చైర్మన్ సుబ్రమణ్యం రెడ్డి, రెస్కో చైర్మన్ సెంథిల్ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో టీడీపీ సీనియర్ నేతలు మునిరత్నం, యల్లప్ప ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, నాయకులు మంజునాథ్ పాల్గొన్నారు.

టీడీపీ ప్రచారంలో పోస్టల్ ఉద్యోగి



ప్రచార వాహనంపై టీడీపీ అభ్యర్థితోపాటు సుబ్రమణ్యం

చిత్తూరు : టీడీపీ పుంగనూరు నియోజకవర్గ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి చౌడేపల్లె మండలంలో ఈనెల 14వ తేదీన పర్యటించారు. ఈసందర్భంగా పరికిదొన పోస్టల్ శాఖ బీపీఎం వేలూరు సుబ్రమణ్యం టీడీపీ నేత చల్లా రామచంద్రారెడ్డికి స్వాగతం పలికారు. టీడీపీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేపట్టారు. అభ్యర్థికి మద్దతుగా ప్రచారం సైతం చేపట్టారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నేతలు రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు.

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కో-కన్వీనర్‌పై దాడి

పుత్తూరు: నగరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కో-కన్వీనర్ శివపై ఓ వ్యక్తి శుక్రవారం దాడి చేశాడు. వివరాలు.. పట్టణ పరిధిలోని నందిమంగళం గ్రామానికి చెందిన శివ ఉదయం తన పిల్లలను మోటర్‌సైకిల్‌పై స్కూల్ తీసుకెళ్లి వదిలిపెట్టాడు. తిరిగి వస్తుండగా శంకర్‌రాజు అనే వ్యక్తి మరాఠిగేట్ సమీపంలో ఉద్దేశపూర్వకంగా బైక్‌తో ఢీకొట్టాడు. దివ్యాంగుడైన శివ కిందపడిపోవడంతో శంకర్‌రాజు రాయితో విచక్షణారహితంగా దాడి చేశాడు. స్థానికులు కేకలు వేయడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. శివ ఎడమ కాలుకు, తలపైనా తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని స్థానికులు ఆటోలో పుత్తూరు ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. శివ సోదరుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రుయాలో చికిత్స పొందుతున్న శివ

అభ్యర్థుల అఫిడవిట్ సమాచారం

నేర చరిత్ర లేని పెద్దిరెడ్డి



వైఎస్సార్‌సీపీ పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. వ్యవసాయమే ఆధారంగా జీవిస్తూ అంచెలంచెలుగా రాజకీయాల్లో ఎదిగారు. ఆయనకు ఎలాంటి నేర చరిత్ర లేదు.

- నియోజకవర్గాల విభజన అనంతరం 2009, 2014, 2019లో పుంగనూరు ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించారు.
- ఎన్నికల అఫిడవిట్‌లో తన భూములు, నగలు, ఇళ్లు, వ్యాపార లావాదేవిలకు సంబంధించి పెట్టుబడులు, అప్పులతో కలిపి పూర్తి వివరాలు పొందుపరిచారు.
- అన్ని బ్యాంకు ఖాతాల్లో నగదు : రూ.38,33,988లు

రోజాపై ఒక్క కేసు కూడా లేదు



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగరి నియోజకవర్గ అభ్యర్థి ఆర్‌కే రోజా దాఖలు చేసిన అఫిడవిట్ మేరకు ఆమెపై ఎలాంటి కేసులు లేవు. మంత్రి అయిన తర్వాత ఆమె ఆస్తులు సంపాదించారు అంటూ టీడీపీ వారు చేసే ఆరోపణలు సైతం ఉత్తుత్తివే అని అఫిడవిట్ ద్వారా బయటపడింది. ఆమెకున్న భవనాలు, వాహనాలు, వ్యవసాయ భూములు అన్నీ ఆమె మంత్రి కాక ముందు టీవీషోల్లో నటించే సమయంలో కొనుగోలు చేసినవే అని వెల్లడైంది.

వెంకటేగౌడ ఆస్తులు రూ.42 కోట్లు



పలమనేరు : పలమనేరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎన్.వెంకటేగౌడ చర, స్థిరాస్తులు రూ.42 కోట్లుగా తాను సమర్పించిన అఫిడవిట్‌లో చూపారు. అయితే ఆయన అప్పులు సైతం రూ.18.40 కోట్లుగా చూపెట్టారు. కాగా ఆయనపై ఓ ఎస్‌ఐఏ కేసు మాత్రమే ఉంది.

పేదరికం నుంచి రాజకీయాల్లోకి



వైఎస్సార్‌సీపీ గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి పేదరికం నుంచి రాజకీయాల్లోకి వచ్చారు. కృపాలక్ష్మి భర్త ఐటీసీఎల్ కంపెనీలో ఉద్యోగి. ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం..

- భర్త అనిల్‌కుమార్ బహుమతిగా ఇచ్చిన ఇంటి స్థలం విలువ : రూ.35 లక్షలు
- కారు రుణం: రూ. 7 లక్షలు
- బంగారం: 400 గ్రాములు • నగదు : రూ.3లక్షలు ఉన్నాయి.
- భర్త బ్యాంకు ఇంటి రుణం : రూ.88 లక్షలు
- బ్యాంకులో వ్యక్తిగత రుణం : రూ.18లక్షలు

నేర చరిత్ర లేని రెడ్డెప్ప



స్థిరాస్తులు : రూ:2.17 కోట్లు
అప్పులు : రూ:41.41 లక్షలు
గృహాలు : రెండు
వాహనం : ఒక కారు

పుంగనూరు: ఎటువంటి నేర చరిత్ర లేని సామాన్య దళిత కుటుంబంలో జన్మించిన ఎన్.రెడ్డెప్ప అజాత శత్రువుగా అందరి మన్ననలు పొందడంతో చిత్తూరు పార్లమెంటుకు రెండవసారి పోటీ చేస్తున్నారు. ఆయన తన నామినేషన్ల అఫిడవిట్‌లో పేర్కొన్న మేరకు..

వివాదరహితుడు సునీల్‌కుమార్



చిత్తూరు రూరల్: పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సునీల్‌కుమార్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆ సమర్పించిన అఫిడవిట్‌లో ఎలాంటి కేసులు లేవు. గతంలో పూతలపట్టుకు ఎమ్మెల్యేగా వ్యవహరించిన సమయంలో ప్రజలతో సామరస్యంగా మెలిగారు. వివాదాలకు దూరంగా ఉన్నారు. మంచి పేరును సంపాదించుకున్నారు. ఎప్పుడు ప్రజల్లోనే తిరుగుతూ వారి సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారాని కృషి చేసేవారు. నాయకులు, కార్యకర్తలను కూడా అప్యాయంగా పలకరించి కలుపుకుపోయేవారు. తద్వారా పూతలపట్టులో ఇటు ప్రజలను.. అటూ నాయకులను మెప్పించి ఒదిగిపోయారు.

అమరనాథ రెడ్డిపై 24 కేసులు



పలమనేరు: మాజీమంత్రి, చిత్తూరు జిల్లా పలమనేరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమరనాథ రెడ్డిపై ఆయనిచ్చిన అఫిడవిట్ సాక్షిగా 24 కేసుల్లో ఆయన నిందితుడిగా ఉన్నారు.

ఇవీ కేసుల వివరాలు:

పలమనేరులో ఆరు, ముదివేడులో రెండు, తిరుచానూరులో రెండు, వీకోటలో రెండు, బంగారుపాళెం, నరహరిపేట, ములకలచెరువు, చిత్తూరు 1 టౌన్, చిత్తూరు 2టౌన్, పూతలపట్టు, బైరెడ్డిపల్లి, కుప్పం, గుడుపల్లి, తాడేపల్లి, రాళ్ళబూదుగూరు, అనంతపూర్ జిల్లా డీ.హీరేహాల్‌లో ఒకటి

ఇవీ ఆస్తులు:

చరాస్తులు : రూ.11.84 కోట్లు
స్థిరాస్తులు : రూ.11.84కోట్లు
అప్పులు : రూ.11.72 కోట్లు
సతీమణి రేణుకా రెడ్డి చరాస్తులు : రూ.1.22 కోట్లు
సతీమణి రేణుకా రెడ్డి స్థిరాస్తులు : రూ.60 లక్షలు

అప్పు : రూ.71.25
భార్య పేరిట పలు కంపెనీలు
తాపసీ గ్రానైట్స్,
తాపసీ షెల్టర్స్, తాపసీ ప్రాజెక్ట్స్,
తాపసీ ప్రాపర్ ఎస్‌పీఆర్ అండ్‌కో

సేవే లక్ష్యంగా విజయానందరెడ్డి

చిత్తూరు అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంసీ విజయానంద రెడ్డి ఆస్తులతో పాటు అప్పులు కూడా ఎక్కువగా ఉన్నాయి.

సేవా కార్యక్రమాలు:

- గడచిన ఐదేళ్లల్లో చిత్తూరులో మార్కెట్ గేటు ఉచితం చేయడానికి, ఉచిత శుద్ధినీటి ప్లాంట్లు, రంజాన్ తోఫా, పేదలకు తోపుడు బండ్లు, మహాప్రస్థానం వాహనాలు, జగనన్న మొబైల్ క్యాంటీన్ లాంటి సేవా కార్యక్రమాలకు విజయానంద రెడ్డి భారీగా నిధులు వెచ్చించారు.

విద్యార్హత : బీకామ్
ఆస్తులు : రూ.26.73 కోట్ల
భార్య పేరిట : రూ.18 కోలు
మొత్తం అప్పులు : రూ.19.84 కోట్లు



రెండు గంటలొస్తే ఐదొందలు ఇస్తాం..!

'మన ఊర్లోకే ఆటోలు వచ్చాయి. వీటిలో కుప్పానికి వచ్చి రెండు గంటల సేపు ఉండే ఐదు వందల దుడ్డ ఇస్తాం, బిర్యానీ పొట్లాం అందిస్తాం' అని తెలుగు తమ్ముళ్లు గ్రామాల్లో తిరిగారు. శుక్రవారం చంద్రబాబు నామినేషన్ ర్యాలీలో జన సమీకరణకు టీడీపీ నేతలు అపసోపాలు పడ్డారు. ఆటోలు, జీపులు ఏర్పాటు చేసినా జనం కదలకపోవటంతో ఇంటింటికీ వెళ్లి బతిమాలుకున్నారు. చంద్రబాబు భార్య భువనేశ్వరి వస్తున్నారని, డబ్బులు ఇస్తామని చెప్పినా ప్రజల నుంచి స్పందన కరువైంది. దీంతో ఇతర నియోజకవర్గాల నుంచి జనాలను తీసుకువచ్చి కార్యక్రమం అయిందనిపించారు. ఈ క్రమంలోనే మార్గం మధ్య గుండిశెట్టిపల్లి వద్ద ఉన్న కర్ణాటక మద్యం దుకాణాల వద్ద పలు వాహనాలు ఆగిపోయాయి. బస్సుల్లో వచ్చిన వారితో అక్కడి మద్యం దుకాణాలు సందడిగా మారాయి.

– శాంతిపురం

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామ స్వామివారి ఆలయంలో శుక్రవారం రాత్రి శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి మూలవర్లకు అభిషేకం చేశారు. ఉదయం 8 గంటలకు ఉత్సవమూర్తులను ఊంజల్ మండపానికి వేంచేపు చేశారు. నరసింహతీర్థం నుంచి తీసుకొచ్చిన జలంతో శ్రీకోదండరామునికి అభిషేకం చేశారు. అనంతరం 9 నుంచి 11 గంటల వరకు యాగశాలలో స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. రాత్రి శ్రీరామ పట్టాభిషేకం శాస్త్రోక్తంగా చేపట్టారు.



పట్టాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

నాటి ధీమా ఎక్కడ..?

- చంద్రబాబుకు కుప్పంలో గెలుపుపై సడలిన నమ్మకం!
- పార్టీ కార్యాలయంలోనే చందా బిందెలు

గుడుపల్లె : కుప్పం నియోజకవర్గ ప్రజలకు 35 ఏళ్లుగా మాయమాటలు చెప్పి చంద్రబాబు విజయం సాధించేవారు. అయితే ఈ పర్యాయం ఆయనలో గెలుపుపై నాటి ధీమా కనిపించడంలేదని ఆ పార్టీ కార్యకర్తలే బహిరంగంగా చర్చించుకుంటున్నారు. అందుకే తరచూ కుప్పంలో పర్యటిస్తున్నారని, ఆయన సతీమణి భువనేశ్వరి సైతం ప్రచారం చేపడుతున్నారని గుసగుసలాడుకుంటున్నారు. 2019 ఎన్నికల్లో స్థానిక టీడీపీ నేతలను నమ్మితే మెజారిటీ 30వేలకు పడిపోవడంతో చంద్రబాబులో మరింత అభద్రత మొదలైందని వ్యాఖ్యానిస్తున్నారు. అందుకే ఈ పర్యాయం కుప్పం నేతలను నమ్ముకుంటే పుట్టి మునిగిపోతుందని భావిస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే శుక్రవారం కుప్పంలో తన తరపున నామినేషన్ వేసేందుకు వచ్చిన నారా భువనేశ్వరిని రెండు రోజులపాటు అక్కడే మకాం వేసి స్థానిక నాయకత్వానికి దిశానిర్దేశం చేయాలని సూచించినట్లు సమాచారం.

కదలని చందా బిందెలు!

ఎన్నికల నామినేషన్ డిపాజిట్ సొమ్మును చంద్రబాబు కుప్పం ప్రజల నుంచే చందాల రూపంలో సేకరించడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. నామినేషన్‌కు 15 రోజుల ముందుగానే ఆయన చందా బిందెలను నియోజకవర్గంలోని అన్ని పంచాయతీలకు నేతల ద్వారా పంపేవారు. అయితే ఈ పర్యాయం మాత్రం చందా బిందెలు కుప్పంలోని టీడీపీ కార్యాలయానికే పరిమితమయ్యాయి. ఈ దఫా చందాలకు వెళితే మొదటికే మోసం వస్తుందని గ్రహించే బిందెలను కదిలించలేదని స్థానిక నేతలు చెవులు కొరుక్కుంటున్నారు. ఈ క్రమంలోనే కుప్పం నియోజకవర్గ టీడీపీ నేతలు మూడు గ్రూపులుగా విడిపోయి ఎవరికి వారే యమునా తీరే మాదిరిగా వ్యవహరిస్తున్నట్లు ఆ పార్టీ కార్యకర్తలు నిరుత్సాహపడుతున్నారు. స్థానిక నేతలకు ప్రాధాన్యమివ్వకుండా వేరే ప్రాంతానికి చెందిన కంచర్ల శ్రీకాంత్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడమే ఇందుకు కారణమని చర్చించుకుంటున్నారు.



కుప్పం టీడీపీ కార్యాలయంలో చందా బిందెలు